

నేడు నిర్వాసిత రైతు సదస్సు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు రాక

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

విజయనగరో జిల్లా గంట్యాడ మండలం తాటిపూడిలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భూ నిర్వాసిత పోరాట కమిటీ (ఏపి రైతు సంఘం) ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం 10గంటలకు సదస్సు జరుగనుంది. ఈ సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ హాజరు కానున్నారు. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు, కోళ్ల లలితకుమారి, సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తదితరులను ఈ సదస్సుకు ఆహ్వానించినట్లు పోరాట కమిటీ కన్వీనర్ చల్లా జగన్ తెలిపారు. 58 గ్రామాల నుంచి రైతులు హాజరవుతారని తెలిపారు.

చెరువు ఆక్రమణ

- సాగునీరందక రైతుల ఆందోళన
- అడిగే నాథుడే కరువు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని కొత్తూరు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 143లో పదిఎకరాల 42 సెంట్లు విస్తీర్ణంలో ఉన్న సీరాపువాని చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుపోయింది. చెరువు సగం ఆక్రమణలకు గురికావడంతో రూపాన్ని కోల్పోయింది. ఈ చెరువే ఆధారంగా కొత్తూరు, కొత్తపల్లి గ్రామాలకు చెందిన సుమారు 100 ఎకరాలకు సాగునీరందేది. ప్రస్తుతం చెరువు సగం ఆక్రమణకు గురికావడంతో సాగునీరందక ఆయకట్టు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. చెరువు ఆక్రమణలపై రైతులు ఎన్నిసార్లు తమ గోడును అధికారులకు తెలియజేసినా ఫలితం సున్నా పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పెత్తందారులు చిన్న, సన్నకారు రైతులను తమ పరిసరాల్లో లేకుండా చేసేందుకు చెరువులను కబ్జా చేసి వ్యవసాయదారులకు నీరందకుండా చేయాలని ఉద్దేశంతో రాజకీయ, అధికార జులం కలగలిపి చెరువును ఆక్రమించేంలా కుట్ర పన్నుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులకు చెరువు కబ్జాయిన విషయం తెలిసినప్పటికీ, వాస్తవానికి ఈ చెరువు విస్తీర్ణం పదెకరాల42 సెంట్లు ఉన్నప్పటికీ ప్రస్తుతం ఐదు ఎకరాలు తగ్గిపోయింది. ఈ విషయం తెలిసినా అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

జిల్లాలో చెరువుల ఆక్రమణలు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది అండదండలతోనే జరుగుతున్నాయి. ఎందుకంటే కళ్ల ముందు కబ్జాలు జరుగుతున్నా చెరువుల్లో పెద్దపెద్ద భవనాలు నిర్మిస్తున్నా కనీసం ఆయా శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అడ్డుకోవడం లేదు. చెరువుల్లో దొంగ పట్టాలు రాజ్యమేలుతున్నప్పటికీ రెవెన్యూ శాఖ కనీసం స్పందించడం లేదు. ఈ విషయమై పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు శూన్యం. చెరువుల కబ్జా వెనుక కింద స్థాయి నుండి పై స్థాయి అధికారుల వరకు కబ్జాదారులకు అండదండలున్నాయి.

వంగల దాలి నాయుడు,
జిల్లా అధ్యక్షులు,
ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి.



ఆక్రమణకు గురైన శీరాపువాని చెరువు

అడిగే నాథుడే లేడు...!

మండలంలో చెరువుల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతున్న విషయం అధికారులకు తెలిసినా ఎవరూ నోరు మెదపడం లేదు. దీంతో అమాయక జనంపై అజమాయిషీ చలాయించడం తప్ప సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై వెనుక భారీ మొత్తంలో ముడుపులు చేరుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


హెచ్చరిక బోర్డు తొలగింపు

చెరువు ఆక్రమణలపై అధికారులు గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును ఆక్రమణదారుల తొలిగించినట్లు ఆయకట్టు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్చరిక బోర్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమైనట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

నివేదిక అందజేసేందుకు యత్నం

కొంత మంది వ్యక్తులు చేసిన ఫిర్యాదు మేరకు చెరువులను పరిశీలించి ఆక్రమణ, విచారణ జరిపించి, ఎంత విస్తీర్ణం ఆక్రమణలో ఉన్నదని గుర్తించేందు సిబ్బందింతో నిర్ధారణ జరిపి నివేదికను సంబంధిత అధికారులకు సమర్పిస్తాం.

డిటిపిఎస్ఎల్ కుమార్,
డిప్యూటీ తహాశీల్దార్



ఆక్రమణదారులు తొలగించిన హెచ్చరిక బోర్డు

కార్పొరేట్లకు వికాసం.. సామాన్యులకు విషాదం

కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

దేశంలోని బడా కార్పొరేటర్లయిన అంబానీ, ఆదానీలకు వికాసం, సామాన్య ప్రజలకు విషాదం నింపేలా గురువారం పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఉందని, దీన్ని సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని కార్యదర్శి రెడ్డి వేణు పేర్కొన్నారు. మరోసారి రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి బడ్జెట్ను ప్రజలంతా వ్యతిరేకించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌పై అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ మన రాష్ట్రానికి సంబంధించిన ఎలాంటి ప్రతిపాదనలు బడ్జెట్లోలేవన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో కొనసాగించే విషయం గానీ, పోలవరం నిర్వాసితుల విషయం గాని, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి రాజధానికి నిధులు, విభజన హామీల ప్రస్తావన వంటి తదితర ఏ అంశాలూ ఈ బడ్జెట్లో లేకపోవడం మరోసారి ఆంధ్రప్రదేశ్ ప్రజలను వంచించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని స్పష్టమవుతున్నదని అన్నారు. మన రాష్ట్రం నుండి జిఎస్టీ వసూళ్ల పెరిగినా మన రాష్ట్రం వాటా మాత్రం పెరగలేదన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలంతా ముందుకు రావాలని వైసిపి, టిడిపి, జనసేన సహా అన్ని పార్టీలు ఈ కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ ముందుకు రావాలని కోరారు. కేంద్ర విద్రోహానికి వ్యతిరేకంగా ఈ నెల 7,8 తేదీల్లో ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ గత 10 ఏళ్ల విషాద భారతం కొనసాగింపుగానే ఉందన్నారు. ఈ బడ్జెట్‌లో 99 శాతం ప్రజలకు ఎలాంటి ఉపశమనం లేదన్నారు. బడా కార్పొరేట్లకు వికాసం, సామాన్యులకు విషాదం మిగిలిందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రజల ఆస్తుల్ని అంబానీ, అదాని లాంటి బడాకార్పొరేట్లకు కట్టబెట్టడంలో ఈ ప్రభుత్వం జయప్రదమైందని విమర్శించారు. నిరుద్యోగులకు తీవ్రంగా అన్యాయం జరిగిందని, ధరల పెంపుదలతో ప్రజలపై భారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశా. జీఎస్టీ పేరుతో రెట్టింపు పరోక్ష పన్ను వసూలు చేయడమే దీనికి తార్కాణమన్నారు. ప్రత్యక్ష పన్ను రాయితీలన్నీ కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చి పెంపుదల భారం అంతా మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతిపై, ఉద్యోగవర్గాలపై వేయటం ఈ కాలంలో వారు సాధించిన "ఘనత" అన్నారు. విదేశీ పెట్టుబడిదారులకు పెద్దపీట వేసి చిన్న పరిశ్రమలను, వ్యాపారస్తులను దెబ్బతీశారన్నారు. సాధారణ ప్యాసింజర్ రైళ్ళను తగ్గించి వందేభారత్ రైళ్ల పేరుతో ప్రయాణాల్ని భారంగా మార్చారు. ఈ అసంతృప్తిని అంతా పక్కదారి పట్టించడానికి, అణచటానికి మతాన్ని అడ్డంగా ఉపయోగించుకొని రామనామస్మరణతో ప్రజల్ని మాయ చేయాలని చూస్తున్నారు. ప్రజల్ని మోసం చేయడానికి వేసుకున్న ముసుగు మాత్రమే ఈ రామనామ స్మరణ. దేశాన్ని మతరాజ్యంగా మార్చడం వారి ధ్యేయమని నిన్న రాష్ట్రపతి ప్రసంగంలో, నేటి బడ్జెట్ ఉపన్యాసంలో స్పష్టంగా వెల్లడైందని పేర్కొన్నారు. ఒకవైపు ఆర్థిక భారాలు ప్రజలపై వేస్తూ కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెడుతూ మరోవైపు మతోన్మాద భావోద్రేకాలను రెచ్చగొట్టి దేశాన్ని ఇచ్చిన బలహీనపరిచే బిజెపి వైఖరిని మేధావులు లౌకికవాదులు అన్ని పార్టీలు ఖండించాలని కోరారు. ఈ ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అవినీతిమయం మున్సిపల్ కార్యాలయం : టిడిపి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో బదిలీపై వెళ్లిన పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు కార్యాలయాన్ని అవినీతిమయంగా మార్చివేశారని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర ఆరోపించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయన పరిపాలనలో అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించడమే కాకుండా, మున్సిపాలిటీ నిధులను అక్రమ పద్ధతుల్లో దుర్వినియోగం చేశారని విమర్శించారు. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యేతో కుమ్మక్కై, బదిలీపై వెళ్తు అనర్హులకు, వారికి అనుకూలురైన వారికి, డబ్బులు తీసుకుని 20 మందికి ఔట్సోర్సింగ్ ఉద్యోగాలకు పాత తేదీలతో నియామక పత్రాలు ఇచ్చారని ఆరోపించారు. వీటన్నింటికీ సంబంధించి తమ దగ్గర పూర్తి ఆధారాలున్నాయని త్వరలోనే వాటిని బయట పెడతామని తెలిపారు. విలేకరుల సమావేశంలో నాయకులు బార్నాల సీతారాం, పాల సత్యనారాయణ, వంగల దాలినాయుడు, మజ్జి వెంకటేష్, బోను చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ఆదరాబాదరాగా కార్మికులను నియమించడమేంటి? : సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీలో ప్రజారోగ్య విభాగంలో ఆదరా బాదరాగా కాంట్రాక్ట్ కార్మికులను నియమించడమేమిటని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు రాజాంకు బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడును ప్రశ్నించారు. గురువారం రాత్రి కమిషనర్ కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకు హాజరైన కమిషనర్‌ను కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులతో కలిసి మాట్లాడారు. మున్సిపాలిటీలో కార్మిక యూనియన్ ఉందని, యూనియన్ సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వకుండా అనర్హులను కార్మికులుగా నియమించారని ప్రశ్నించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఇదే పారిశుధ్య వృత్తిని నమ్ముకున్న కార్మిక కుటుంబాలు ఎన్నో ఉన్నాయని, వీరితో పాటు మరణించిన పారిశుధ్యకార్మిక కుటుంబ సభ్యులను నియమించకుండా కొత్త వారిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ఈ నియామకాలలో పైరవీలు జరిగినట్లు బయట గుసగుసలు కూడా వినిపిస్తున్నాయని అన్నారు.

9న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం (నేషనల్ డీ వార్మింగ్ డే), పలు ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు అధ్యక్షతన ఆరోగ్య పర్యవేక్షకులకు గురువారం స్థానిక వైద్య ఆరోగ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ ఈనెల 9న డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని, ఏడాది నుంచి 19ఏళ్ల వరకు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించి నులి పురుగులను నిర్మూలించడం ముఖ్యోద్దేశ్యమని అన్నారు. తద్వారా పిల్లల్లో రక్తహీనత నివారణ, వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుందని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల వారీగా ఉన్న మొత్తం అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలల్లోని పిల్లలు, విద్యార్థుల సంఖ్య వివరాలు, ప్రణాళిక, నివేదికలను ఆరోగ్య కార్యాలయానికి విధిగా సమర్పించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేయాలని ఆయన స్పష్టం చేశారు.

జెఎఎస్ ప్రోగ్రామ్‌లో కంటి వెలుగుకు సంబంధించి గుర్తించిన కేటరాక్ట్ సమస్యలున్న 792 మందికి ఈ నెల1 నుండి 15 వరకు శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి, విజయనగరం పుష్పగిరి, విశాఖ శంకర్ ఫౌండేషన్‌లో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని, నిర్దేశించిన తేదీల ప్రకారం వారిని సిద్ధం చేయాలని అన్నారు. రవాణా సౌకర్యం కల్పించి ఆసుపత్రులకు చేర్చడం జరుగుతుందని వివరించారు. జెఎఎస్-2లో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సకు అర్హులైన వారికి తగు నిర్దేశం చేయాలని, ఆరోగ్యశ్రీ ద్వారా అందజేసే వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వేలు చేయాలని, ఎక్కడైనా జ్వరాలు గుర్తిస్తే వెంటనే నిర్ధారణ పరీక్షలు జరిపి సత్వరమే చికిత్స అందజేయాలని అన్నారు. డ్రైడే కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. పిల్లల్లో వ్యాధి నిరోధక టీకాలు శతశాతం లక్ష్యంగా కృషి చేయాలన్నారు. గర్భిణీ, బాలింతలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలందించి, హైరిస్క్ గర్భిణీల ఆరోగ్యాన్ని తరచుగా పర్యవేక్షణ చేసి మాతా, మరణాలు జరగకుండా కృషి చేయాలన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ డి.భాస్కరరావు, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సుకుమార్ బాబు, డిఎంఒ డాక్టర్ టి.జగన్ మోహనరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్ కుమార్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ నగేష్‌రెడ్డి, ఎఎంఒ సూర్యనారాయణ, శంకర్, సన్యాసిరావు, విజయ లక్ష్మి, జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

జనసేన టికెట్ రేసులో రామకృష్ణ

ఉద్యోగానికి రాజీనామా చేసిన సహకార అధికారి

ప్రజాశక్తి - సాలూరు



నియోజకవర్గ జనసేన టికెట్ రేసులో రిటైర్డ్ సహకార శాఖ అధికారి గేదెల రామకృష్ణ ఉన్నారు. ఇటీవల ఆయన సబ్ డివిజనల్ కోపరేటివ్ అధికారి ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మూడు నెలలు ముందుగానే ఆయన ఉద్యోగానికి రాజీనామా చేయడంతో ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. ఉన్నత విద్యావంతుడు, నిజమైన గిరిజనుడైన రామకృష్ణ గత కొంతకాలంగా రాజకీయాల్లోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నారు. సాలూరులో సబ్ డివిజనల్ కోపరేటివ్ అధికారిగా పనిచేసిన ఆయనకు ఈ ప్రాంత వాసులతో సత్సంబంధాలు వున్నాయి. ఇప్పటికే ఆయన జనసేన నాయకత్వాన్ని కలిసి తన బయోడేటా సమర్పించారు. ఉద్యోగానికి రాజీనామా చేసి రావాలని అధిష్ఠానం కోరడంతో ఆయన విఆర్ఎస్ ఇచ్చారు. గతంలో ఆయన టిడిపి ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే ఆ పార్టీ నాయకుల నుంచి తగిన స్పందన లేకపోవడంతో జనసేన వైపు మొగ్గు చూపారు. టిడిపితో పొత్తులో భాగంగా జనసేనకు ఎమ్మెల్యే లేదా అరుకు ఎంపి సీటు కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. తనకు ఎమ్మెల్యే సీటు కావాలని రామకృష్ణ జనసేన అధిష్టానాన్ని కోరినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే వీలుకాని పక్షంలో ఎంపీగానైనా పోటీకి సిద్ధమేనని అధిస్థానానికి చెప్పినట్లు సమాచారం. గురువారం ఆయన పట్టణంలోని ముఖ్య జనసేన నాయకులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ జనసేన అధిష్టానాన్ని ఎమ్మెల్యే సీటు కావాలని కోరినట్లు చెప్పారు. టిడిపితో పొత్తులో భాగంగా నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని పార్టీ ఆదేశిస్తే చేస్తానని చెప్పారు.

ఎవరీ రామకృష్ణ

పార్వతీపురం మండలం గోచెక్క సమీపంలో ఉన్న కొసరవానివలస గ్రామానికి చెందిన గేదెల రామకృష్ణ ఎస్టీ గదబ సామాజిక వర్గానికి చెందిన వారు. ఆయన పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. సహకార శాఖలో వివిధ హెూదాల్లో పనిచేశారు. అంతేకాకుండా డిఆర్‌డిఎ, డ్వామా, బిసి సంక్షేమ శాఖ ల్లో కూడా పని చేశారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో ఆయన పనిచేశారు. ఈ ప్రాంత గిరిజనులతో ఆయనకు బంధుత్వాలు కూడా వున్నాయి.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గృహనిర్మాణం, రీ-సర్వే, అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె అనంతరం సరుకులు రవాణా, పనితీరు, జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ, పంచాయతీరాజ్ పనులు, తదితర పథకాలపై సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ శతశాతం పూర్తిచేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జాతీయ డి-వార్మింగ్ డే రోజున పాఠశాలలు, జూనియర్ కళాశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖాధికారి బి.జగన్నాథరావు, డిఇఒ ఎస్.ప్రేమ కుమార్, డ్వామా పీడీ రామచంద్రరావు, ఎడి సర్వే కె.రాజకుమార్, డిఇవిఒ డి. మంజులవీణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పొగమంచుతో స్తంభించిన వాహనాల రాకపోకలు

కమ్మేసిన పొగ మంచు

నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టంలో గురువారం ఉదయం దట్టమైన మంచు ఏర్పడడంతో వాహన రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ మంచు కారణంగా ఒట్టిగెడ్డ వంతెన రైలింగ్‌కు వాహనం ఢీకొనడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అటు పాలకొండ వైపు కిలోమీటర్ల దూరంలోనూ ఇటు పార్వతీపురం వైపు కిలోమీటర్ల దూరంలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో స్థానిక ఎస్సై ఎం.గోవింద్, సిబ్బంది వంతెన వద్దకు చేరుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ఉదయం 6 నుండి 8గంటల వరకు దట్టమైన పొగమంచు ఏర్పడడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని ములగ పంచాయతీ పరిధిలో గల డి.ములగలో గురువారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామం ప్రారంభంలో గల కోనేరు గట్టును అనుసరించి 150 మీటర్ల సిసి రోడ్లు, రక్షణ గోడ నిర్మాణానికి రూ.87లక్షలు ఎపి పంచాయతీ రాజ్ నిధులతో చేపట్టబోయే పనులతో పాటు కెములగ, వెలుగవలస పంచాయితీలకు చెందిన రూ.75లక్షల నిధులతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను స్థానిక సర్పంచులు మడక కృష్ణవేణి, దాలమ్మతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పజల చిరకాల కోరికైనన కోనేరు అభివృద్ధి, అధునాతన భవనాలను మీరు కోరుకున్న విధంగా, మీకు ఇచ్చిన మాట ప్రకారం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంఎంసి చైర్మన్ భాగ్యశ్రీ, ఎంపిడిఒ ఆకిబ్ జావేద్, కార్యదర్శి పకీరు, మండల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి వి.గురురాజు, మండల పార్టీ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు ఎంఇఒ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం గౌరవాధ్యక్షులు ఎన్వైనాయుడు, నాయకులు విజయ, సుశీల ఆధ్వర్యాన కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్ రెడ్డి గతంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని, ప్రభుత్వమే గ్యాస్ ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, మెనూ చార్జీలు పెంచాలని కోరారు.

సీతంపేట : మండలంలోని మధ్యాహ్న భోజన పథకం కార్యకర్తలు ఎంఇఒ ఆనందరావుకు గురువారం తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షు డి.రమణారావు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు పాదయాత్ర సందర్భంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. అలాగే వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, మధ్యాహ్న భోజన పథకం అధ్యక్ష కార్యదర్శులు ఉషా, రొయిబారి, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



సాలూరులో ఎంఇఒ రాజ్‌కుమార్‌కు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



సీతంపేటలో ఎంఇఒకు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

గరుగుబిల్లి : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ఎంఇఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు పి.పావని మాట్లాడుతూ దీర్ఘకాలంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిచో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ చాలా కష్టతరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరచూ మెనూ మారుస్తున్నప్పటికీ మెస్‌ఛార్జీలు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల జీతాలు పెంచడం లేదని విమర్శించారు. ఇఈ సమస్యలపై ఈనెల 5న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బోను లక్ష్మి, అన్నపూర్ణమ్మ, రోహిణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం/బలిజిపేట

మండలంలోని గెడ్డలుప్పి, తామరకండి, బల్లకృష్ణాపురం, కాసాపేట పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ కె.హేమలత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సదుపాయాలు గురించి మరుగుదొడ్లు, లైటింగ్ ఉండే మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. తక్షణమే అన్ని పోలింగ్ కేంద్రాలకు సౌకర్యాలుండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహాశీల్దార్ ఎంవి రమణ, ఎంఇఒ జి.సూర్యదేముడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బలిజిపేట మండలం సుభద్ర, బర్లి, అంపావల్లి, జనార్ధనపురం, పెదపెంకి, నారాయణపురం, బైరిపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఒ పరిశీలించారు.



గెడ్డలుప్పిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ హేమలత

హిజ్రాలకు గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక వైకెపి కార్యాలయం వద్ద గురువారం వైడిఒ నెట్‌వర్క్ అవుట్ రీచ్‌వర్కర్ ఎ.గీతారాణి అధ్యక్షతన హిజ్రాలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గుర్తింపు కార్డులు పంపిణీకి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిజ్రాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, ఎంపిడిఒ ఎ.అప్పారావు, జెడ్పిటిసి జి.సుజాత, నియోజకవర్గంలోని హిజ్రాలు పాల్గొన్నారు.

లక్ష్మణరావు కుటుంబానికి బేబి నాయన పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేటకు చెందిన టిడిపి నాయకులు క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బొమ్మినేని లక్ష్మణరావు కుటుంబాన్ని బొబ్బిలి మాజీ మున్సిపల్ చైర్మన్ బేబినాయన గురువారం పరామర్శించారు. ఇటీవల లక్ష్మణరావు తల్లి చిన్నమ్మ మరణించిన సంగతి తెలిసిందే. పరామర్శించి కుటుంబాన్ని ఓదార్చారు. అలాగే టిడిపి మండల నాయకులంతా ఐక్యంగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సజ్జన శ్రీనివాస రావు, చింతల సత్యం, ఎం.శంకర్రావు, టి.శ్రీనివాసరావుతో పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ అందజేత


ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బంధంవారి వీధిలో ఇటీవల మృతి చెందిన పద్మరాశి శంకర్రావు, కర్రీ ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన బీమా పథకం బీమాను కెనరా బ్యాంకు అధికారులు గురువారం అందజేశారు. ఈ బీమాకింద ఒక్కొక్క కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున బీమాను కెనరా బ్యాంక్ జోనల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ సోరేన్, సీనియర్ మేనేజర్ జి.దినేష్ కుమార్, మేనేజర్ డి.మణికంఠ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు ఈ ఇన్సూరెన్స్ డబ్బును కుటుంబ ఆర్థిక అవసరాలకు వినియోగించుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తప్పులుంటే సరి చేసుకోవాలి : డిపిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

కులగణన సర్వేలో తప్పులుంటే సరి చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని నడిమికెల్ల గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం సర్వే చేస్తున్న కుటుంబాల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు చేయాలన్నారు. సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆయనతో పాటు సచివాలయ కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



మహిళా సంఘసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

ఆసరాతో మహిళా సంఘాలకు రుణవిముక్తి

ప్రజాశక్తి - భామిని

వైఎస్ఎస్ ఆసరాతో మహిళా సంఘాలకు ప్రభుత్వం రుణవిముక్తి కల్పించిందని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. భామినిలో ఎపిఎం డి.భవాని ఆధ్వర్యాన నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సదుపాయాలతో తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకుంటుందన్నారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా పేదలకు సంక్షేమ పథకాలు అందజేశామని, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేసి, మెరుగైన సేవలు వైసిపి అందజేసిందని అన్నారు. మళ్లీ ఈనెల 16 తర్వాత వైఎస్ఆర్ చేయూత నిధులు మహిళా ఖాతాలకు విడుదల చేసి మీ ముందుకు వస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమం వెలుగు ఎపిడి ఆర్వి రమణ, మండల వైసిపి కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, బత్తిలి ఎంపిటిసి టింగా అన్నాజీరావు, ఎంపిటిసి బిడ్డిక తులసి, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, వైసిపి నాయకులు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



తహశీల్దార్ సోమేశ్వరరావును సన్మానిస్తున్న సిబ్బంది

తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక తహశీల్దారు పి.సోమేశ్వరరావుకు సిబ్బంది, విఆర్ఒలు గురువారం ఘనంగా సన్మానించారు. అరకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనకు వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ పాలకొండ మండలంలో పని చేయడం సంతోషంగా ఉందన్నారు. అందరూ ఎంతగానో సహకరించారన్నారు. తనను ఇంతగా ఆదరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు బుచ్చయ్య, మండల సర్వేయర్ వెంకటరమణ, విఆర్ఒల సంఘం ప్రతినిధులు బంకి రాజా, బలివాడ శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

సీతంపేట : స్థానిక తహశీల్దార్ సూరి నరసింహమూర్తి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు అనంతగిరి మండలానికి బదిలీపై వెళ్లారు. సీతంపేట, భామిని మండలాల్లో పనిచేసిన కాలంలో వివాద రహితుడిగా మంచి పేరుపొందారు. రెవెన్యూపై పట్టు సాధించడమే కాకుండా ప్రజల్లో మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అంతేకాకుండా సీతంపేటలో మొట్టమొదటిసారిగా ఉద్యోగం చేయడంతో ఇక్కడ ప్రజలకు సుపరిచితులు. ఉప తాసిల్దార్ నాగేంద్ర ప్రసాద్ కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు

అగ్నిప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక లారీ యాజమానుల సంఘం కార్యాలయంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎంవిఐ జెవిఎస్ఎస్ ప్రసాద్, టౌన్ సిఐ జిడి బాబు, ఫైర్ స్టేషన్ అధికారి యు.సుధాకరరావు పర్యవేక్షణలో అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్ సేఫ్టీ అధికారి నారాయణరావు, యూనియన్ నాయకులు ఐ.నారాయణరావు పాల్గొన్నారు.

చెముడులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని చెముడు పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. స్థానిక సర్పంచ్ బొంగు రాజేశ్వరి ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు. గ్రామంలోని పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగిస్తున్నారు. అలాగే కాలువల్లో మురుగును పూర్తిస్థాయిలో తొలగిస్తున్నారు. గత మూడు రోజులుగా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు స్థానిక వైసిపి నాయకులు బొంగు భీమేశ్వరరావు తెలిపారు.



పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ ప్రతినిధి భీమేశ్వరరావు

పేరుకే ఏరియా ఆసుపత్రి.. ఇంకా 30 పడకలే?

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం 30 పడకల ఆసుపత్రిని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తే మరింత ఎక్కువ మందికి వైద్యం అందించాలని ఉద్దేశంతో అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు భావించారు. ఈమేరకు 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఏరియా ఆసుపత్రిగా 2021లో అప్ గ్రేడ్ అయింది. అయితే ఇప్పటికే 30 పడకలతోనే కొనసాగుతుంది. వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి సుమారు రూ.19 కోట్లు మంజూరైనప్పటికీ ఇప్పటికీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. అవుట్‌పేషెంట్ మేడ పైన రెండు బ్లాకులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఒక్క బ్లాక్ మాత్రమే నిర్మించారు. ఆసుపత్రిలో బెడ్లు చాలీ చాలక సీజన్లో ఒక బెడ్‌పై ఇద్దరికి చొప్పున వైద్యం అందించాల్సిన అవసరం కూడా వస్తుంది. స్థానిక ఏరియా ఆసుపత్రికి సీతంపేట, భామిని, కొత్తూరు, హిరమండలం, ఒడిశా నుంచి కూడా రోగులు వస్తుంటారు. ఈ ప్రాంత ప్రజలకు ఈ ఆసుపత్రే పెద్ద దిక్కు. ప్రస్తుతం ఓపి 200 వస్తుంది. సీజన్లో ఓపి 350 పైగా పెరుగుతుంది. దీనివల్ల రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో ఒక్కొక్క గదిలో నలుగురు వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో అటు రోగులకు ఇటు వైద్యాధికారులకు అవస్థలు తప్పడం లేదు.

వెంటాడుతున్న సమస్యలు

నాలుగు ఆపరేషన్ థియేటర్లు ఉండాల్సి ఉండగా, మూడే ఉన్నాయి. దీంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ఏరియా ఆసుపత్రికి ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉంది. అది లేకపోవడంతో నిరంతరం విద్యుత్ సమస్య వెంటాడుతోంది. దీంతో కొన్ని సమయాల్లో వైద్యం అందించలేని పరిస్థితి వస్తుంది. అలాగే రోగులను ఎక్కించే ర్యాంప్ కూడా లేకపోవడంతో ఈ సమస్య కూడా వెంటాడుతుంది. 23 మంది వైద్యులు ఉండాల్సి ఉంది 20 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో సిఎస్ ఆర్ఎంఒ, సిఐఎస్ జనరల్ మెడిసిన్ లేరు. మరొకరు సెలవులో ఉన్నారు. ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టులు మూడు

రోగులకు తప్పని అవస్థలు



ఖాళీలున్నాయి. దీంతో రోగులకు సకాలంలో ఆ పని నెమ్మదిగా జరుగుతుంది. దీనిపై అధికారులు దృష్టి సారించి వెంటనే ఆ సమస్యలు తీర్చి రోగులకు వైద్యం అందించాలని గిరిజనులు కోరుతున్నారు.

30 పడకలు వాస్తవమే

స్థానిక ఏరియా ఆసుపత్రిలో 30 పడకలే ఉన్నాయి. అయితే ఎన్ఆర్‌సి నుంచి 10, హెచ్‌డియు నుంచి నాలుగు పడకలు ఉన్నాయి. రోగులు ఇబ్బందులు పడకుండా వీటిని ఏర్పాటు చేశాం. భవన నిర్మాణం పూర్తి కాలేదు. ఆసుపత్రి నిర్మాణం పూర్తి స్థాయిలో పూర్తయితే ఎక్కువ మందికి రోగులకు వైద్యం అందించడానికి కృషి చేస్తాం. ల్యాబ్ కొరత లేదు. మందుల నిధులు కొరత లేదు. రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

బి.శ్రీనివాసరావు సూపరింటెండెంట్,
ఏరియా ఆసుపత్రి సీతంపేట.

డిఎస్‌సి అభ్యర్థులను మోసగించిన సిఎం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎన్నికల ముందు 23 వేల ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు ఎన్నికల ముందు కేవలం 6,100 పోస్టులకు క్యాబినెట్లో ఆమోదం తెలిపి డిఎస్సీ అభ్యర్థులను నిలువునా ముఖ్యమంత్రి మోసగించారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత టిడిపి ఐదేళ్ల హయాంలో 18వేల ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేసినప్పటికీ, తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీలు ఇచ్చి నిరుద్యోగులను ఈ ప్రభుత్వం మోసగించిందన్నారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయ పోస్టులను అరకొరగా నియమిస్తామని ప్రకటించడానికి తాము ఎన్నికల స్టంట్‌గా అభివర్ణిస్తున్నామని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలతో పాటు నిరుద్యోగులను దారుణంగా మోసపుచ్చారని, ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి బయటికి మాత్రం మాట తప్పను మడమ తిప్పను ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. మరి కొద్ది రోజుల్లో రాష్ట్రంలోని అన్ని వర్గాలు ఏకమై ఈ ముఖ్యమంత్రిని ఆయన ప్రభుత్వాన్ని దారుణంగా ఓడించబోతున్నారని, అందుకు ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అని ఆయన అన్నారు.

నలుగురు ఎంపిడిఒలకు బదిలీ

పార్వతీపురం : ఇటీవల బదిలీ అయిన ఎంపిడిఒల స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు మండలాల ఎంపిడిఒలను బదిలీ చేశారు. వారిలో కొందరు గురువారం బాధ్యతలు చేపట్టారు.

సాలూరు	కె.ఫణీంద్రకుమార్
బలిజిపేట	ఎన్.రమేష్‌నాయుడు
గరుగుబిల్లి	పి.సూర్యనారాయణ
గుమ్మలక్ష్మీపురం	ఎం.ఈశ్వరరావు

మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ అమలు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూరల్ అమలు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవి గౌరీశంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలను ఈ ప్రభుత్వం అనాలోచితంగా విద్యాశాఖలో విలీనం చేయడం వల్ల ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడే పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. జిల్లా అధ్యక్షులు మర్రాపు మహేష్ మాట్లాడుతూ పాఠశాలల విలీనం వల్ల ఉత్పన్నమైన సమస్యల పరిష్కారం గురించి ప్రభుత్వం చొరవ చూపలేదన్నారు. గత కొంతకాలం నుంచి అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలతో పాటు, కొత్త సమస్యలు కూడా ఉత్పన్నమయ్యాయని, ప్రభుత్వానికి ఎన్ని మార్లు వినతి పత్రాలు సమర్పిస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణారావు తెలిపారు. సత్వరమే సమస్యలు పరిష్కరించాల్సిందిగా కోరారు. ధర్నాలో జిల్లా సబ్ కమిటీ ప్రమీల, ధనలక్ష్మి, బివి రమణ, ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ జి.సూర్యనారాయణ, వేణు, సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, వివిధ మండలాల బాధ్యులు వాసు, పొట్టయ్య, అక్కురాజు, మొహమ్మద్, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కొన్ని గ్రామాలకే కాకుండా అన్ని గ్రామాల ఉపాధి కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. మండలంలోని మరిపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలకు ఉపాధిహామీ పనులు వెంటనే ప్రారంభించాలని, గ్రామాల్లో కూలీలకు పనుల్లేక వలసలు పోతున్న పరిస్థితి ఉందని తెలిపారు. కూలీలకు ఉపాధి పనులు పెట్టాలని అడుగుతున్న గ్రామాల్లో ఉపాధి పనులు పెట్టడం లేదని తెలిపారు. ఇప్పటికైనా మరిపల్లి, మామిడిపల్లి, బాగువలస, శివరాంపురం, పెదబోరబంద వంటి పెద్ద గ్రామాల్లో పనులు ప్రారంభించి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూలి రేట్లు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచాలని, వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగి పని దినాలు తగ్గిపోయాయని, పనుల్లేక కూలీలు ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏడాదికి ప్రతి కుటుంబానికి 200రోజులు పని కల్పించాలని కోరారు. ఉపాధి హామీ నిర్వహణ లోప భూయిష్టంగా ఉందని, అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఉపాధి హామీని చట్టాన్ని అమలు చేయాలని, పనికి అవసరమైన



మరిపల్లిలో వేతనదారులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పనిముట్లు పంపిణీ చేయాలని, పనిచేసే చోట కూలీలకు సౌకర్యాలు కల్పించాలని, వెంటనే అన్ని గ్రామాలకు ఉపాధి హామీ పనులు ప్రారంభించి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో కూలీలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు రాములమ్మ, వేతనదారులు కసినిబోయిన తిరుపతి, తట్టబోయిన సరస్వతి, తౌడు, నమ్మి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు, వీరి ఆందోళనకు సిపిఎం జిల్లాకమిటీసభ్యులు కోరాడ ఈశ్వరరావు సంఘీభావం తెలిపారు.



గెడ్డ వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

పూడిగెడ్డపై వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని రాయగుడ్డివలస పంచాయతీ బయలు గుడ్డి గ్రామ సమీపాన గల పూడిగెడ్డ వద్ద వంతెన నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మర్రి లివ్వు, సాంబయ్య నాయకత్వంలో గ్రామస్తులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ వంతెన నిర్మాణం చేపట్టి గిరిజనులతో పాటు ఈ వాగు దాటి వచ్చిన గురువునాయుడుపేట గ్రామ రైతులకు, సరాయివలస, రాయిగుడ్డివలస, భీమందరవలస గిరిజనుల పనులకు ఉపయోగకరమైన రాకపోకలకు తీవ్రమైన ఇబ్బంది కలిగించిన పూడివాగు వద్ద వంతెన నిర్మించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఎక్కువ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు కూడా ఇక్కడికే రావాల్సి సందర్భంగా వాగుదాటి రావడం చాలా కష్టంగా ఉందని, అలాగే బయలుగుడ్డి నుండి ఆస్పత్రికి వెళ్లాలన్నా, పిల్లలు పాఠశాలకు వెళ్లాలన్నా వాగుదాటి వెళ్లడం ఇబ్బందిగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి ఐటిడిఎ పిఒ, కలెక్టర్ ఈ ప్రాంతంలో పర్యటించి వంతెన నిర్మాణం చేపట్టి ఆదుకోవాలని కోరారు. అలాగే విద్య, వైద్యం గిరిజనులకు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ ప్రాంతంలో పర్యటించి పూడిగెడ్డ వద్ద వంతెన నిర్మించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు టి.కాంతారావు గురువారం మండలంలోని నెలిపర్తి అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాన్ని మధ్యాహ్నం 12.30 గంటలకు తనిఖీ చేయగా పిల్లలకు భోజనం పెట్టలేదని నిర్ధారణ కావడంతో ఆయన ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సారా అమ్మితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ ప్రాంతాల్లో నాటుసారా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సిఐ జిడి బాబు హెచ్చరించారు. పట్టణంలోని పెద్ద వీధి, రెల్లివీధులకు చెందిన 27మందిపై తహశీల్దార్ కార్యాలయంలో గురువారం బైండోవర్ కేసులు నమోదు చేయించారు. అనంతరం వారితో భవిష్యత్తులో సారా విక్రయాలు చేయబోమని ప్రమాణం చేయించారు. సారా కేసులో పదేపదే పట్టుబడితే పిడి యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని, రౌడీషీట్ తెలుస్తామని హెచ్చరించారు.

నాలుగున్నరేళ్లలో అభివృద్ధి ఏది? : టిడిపి

ప్రజాశక్తి - వీరఘట్టం

వైసిపి ఈ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గం ఎక్కడ అభివృద్ధి జరిగిందని అరుకు పార్లమెంటరీ నియోజకవర్గ తూర్పు కాపు అధ్యక్షులు పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు ఆరోపించారు. గురువారం స్థానిక జామి వారి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వీరఘట్టం మండలానికి చెందిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, స్థానిక ఎంపిపి ఉన్నప్పటికీ మండలంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. ఎంపిపి స్వగ్రామైన చిదిమికి ఇప్పటికీ రోడ్డు వేసుకోలేదంటే ఎంత సిగ్గుచేటన్నారు. నిధులు మంజూరు కాకుండానే భూమి పూజలు చేసి గొప్పలు చెప్పుకున్నారు తప్ప ఇప్పటికీ రహదారి పనులు పూర్తికాలేదని విమర్శించారు. వీరఘట్టం ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు చేపడతామని చెప్పి మూడేళ్లు కావస్తున్నప్పటికీ ఇప్పటికీ రహదారి పనులు పూర్తి కాకపోవడంతో ప్రతిరోజు వందలాది భారీ వాహనాల రాకపోకల వల్ల అటు వ్యాపారులు, ఇటు ప్రజలు దుమ్ము, దూళి వల్ల అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కులాలకు సంబంధించిన సంక్షేమ పథకాలు అందించకుండా కార్పొరేషన్ చైర్మన్లను నియమించి కాలం వెల్లదీస్తున్నారే తప్ప ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. టిడిపి ప్రభుత్వంలో కంబర, కొట్టుగుమ్మడ, చిదిమి గ్రామాల బిటి రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిధులు నిలుపుదల చేసిందని ఆయన ఆరోపించారు. మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్ మాట్లాడుతూ అభివృద్ధి ఎక్కడ జరగలేదని, సంక్షేమ పథకాలు పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం మండలానికి సుమారు రెండు కోట్ల రూపాయల వరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, చెత్త సంపద ద్వారా సర్పంచి జామి అనురాధకు మూడు సార్లు రాష్ట్ర అవార్డు లభించింది అన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారాలతో వీధులు కంపు కొడుతున్నాయని, దీంతో చెత్త సంపద కేంద్రం కూడా మూసి వేశారన్నారు. చెత్త సేకరించే కార్మికులకు జీతాలు సకాలంలో అందించకపోవడంతో వారు బతుకులపై నీళ్లు పోసినట్లు అయ్యిందని విమర్శించారు.

శంఖారావం విజయవంతం చేయాలి

పాలకొండ కేంద్రంలోని ఈనెల 7న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శంఖారావం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం చేయాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో ప్రతి రైతు తనకున్న విస్తీర్ణంలో కొంత భాగం ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖ రాజు అన్నారు. గురువారం తమ చాంబర్లో ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు సార్వత్రిక సూత్రాలు తెలియాలని, ప్రతి రైతు తనకు ఉన్న విస్తీర్ణంలో కొంత భాగం ప్రకృతి వ్యవసాయ చేయాలని అన్నారు. అలాగే ఎటిఎం మోడల్స్ తక్కువ విస్తీర్ణంలో నిరంతర ఆదాయం వచ్చేలా బహుళ పంటలు వేసుకుని విస్తీర్ణం పెంచుకోవాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు నేరుగా తమకు తాముగా అమ్ముకొనేలా పాటిస్పెట్ గ్యారంటీ సిస్టమ్ అనే సర్టిఫికేట్ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అందజేస్తామన్నారు. అలాగే ప్రభుత్వ సముదాయాలు దగ్గర జిల్లాలో ప్రతి మండల పరిధిలో కొన్ని ముఖ్యమైన కేంద్రాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, మిలెట్స్ మొదలైనవి అమ్మడం జరుగుతుందన్నారు. అలాగే భూమిని 365 రోజులు కప్పి ఉంచేలా రైతులకు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ప్రకృతి వ్యవసాయం మేనేజర్ షణ్ముఖరావు

సలహాలు, సూచనలు ఇచ్చేలా సిబ్బంది నిరంతరం రైతులతో ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకులో పడ్డ హౌసింగ్ బిల్లులు ఏమయ్యాయి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కూనేరు స్టేట్ బ్యాంకులో పడిన రూ.51,000 హౌసింగ్ బిల్లు ఏమయ్యాయని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని మసిమండ పంచాయతీ పెదపేడుం గ్రామానికి చెందిన పువ్వుల భాగమ్మ 2021లో ఇల్లు పూర్తి చేయగా లక్ష రూపాయల వరకు బిల్లు వచ్చింది. మిగతా రూ.80వేల్లో రూ.51వేలు పైన తెలిపిన ఇటీవల లబ్ధిదారుని స్టేట్ బ్యాంకు అకౌంట్‌లో జమైనట్టు హౌసింగ్ అధికారులు ఆమెకు తెలిపారు. ఈ మేరకు ఆమె బ్యాంకు వెళ్తే నిధులు జమ కాలేదని బ్యాంకు అధికారులు తెలిపారన్నారు. ఈ విషయమై మళ్లీ లబ్ధిదారు హౌసింగ్ అధికారులకు అడిగితే బ్యాంక్ అకౌంట్ తప్పు వల్ల తిరగ డబ్బులు మా అకౌంట్‌కు వచ్చాయని చెప్పారున్నారు. అయితే ఆ డబ్బులు మళ్లీ లబ్ధిదారుని అకౌంట్లో జమ చేయకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంపైన హౌసింగ్ అధికారులు దర్యాప్తు చేపట్టి లబ్ధిదారులకు మిగతా రూ.80వేలు జమయ్యేలా కోరారు.

టిడిపితోనే బిసిలకు న్యాయం : వైరిచర్ల, శత్రుచర్ల

ప్రజాశక్తి - కురుపాం

టిడిపితోనే బిసిలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎంపి వైరిచర్ల ప్రదీప్‌చంద్రదేవ్, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాం ధూళికేశ్వర ఆలయ సమీపంలో టిడిపి మండల అధ్యక్షులు కెవి కొండయ్య అధ్యక్షతన జరిగిన జయహో బిసి కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి అంటేనే బీసీలకు ఆదరణ, బిసిల పార్టీగా గుర్తింపు పొందిందని అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ ప్రజలను నట్టేట ముంచిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనని, కావున రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి మాట్లాడుతూ బిసి, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేష్, ఐదు మండలాల బిసి నాయకులు, టిడిపి, జనసేన కన్వీనర్లు, బిసిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బిసిలను వెనక్కి నెట్టిన జగన్ : సంధ్యారాణి

సాలూరురూరల్ : బిసిలను పూర్తిగా వెనక్కు పెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే చెందుతుందని సాలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మిడి సంధ్యారాణి



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎంపి ప్రదీప్‌చంద్రదేవ్

ఆరోపించారు. మండలంలోని బాగులసలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిసిలంటే వైసిపి ఎంతో చులకనని విమర్శించారు. కావున మరికొద్ది రోజుల్లో ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడటానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌పి భంజ్‌దేవ్ మాట్లాడుతూ టిడిపికి బిసిలే వెన్నుదన్నారు. కార్యక్రమంలో సాలూరు, మక్కువ, మెంటాడ, పాచిపెంట, సాలూరు పట్టణ టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుల్ల వేణు, చలుమూరు వెంకటరావు, మత్స శ్యామ్, ముఖీ సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తురకనాయుడువలస వద్ద రక్షణగోడలు లేని వంతెన

ప్రమాదకరంగా వంతెన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం తురకనాయుడువలస సమీపానున్న వంతెన ప్రమాదకరంగా ఉంది. ఈ వంతెన నిర్మించి 15 ఏళ్లు దాటినా నేటికీ రక్షణ గోడ నిర్మించలేదు. వంతెనకు సమీపాన మలుపు వద్ద పొదలు పెరిగిపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పార్వతీపురం నుంచి పెదబుడ్డిడి, ఇటిక గ్రామాలకు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా వంతెనకు రక్షణ గోడలు నిర్మించాలని, రోడ్డుకు ఇరువైపులాఉన్న పొదలు తొలగించాలని కోరుతున్నారు.